పురుగుల అన్నం తినలేం..

- మూడు రోజులుగా ఇదే దుస్థితి
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు
- తినలేక పస్తులుంటున్న పిల్లలు
- పట్టించుకోని అధికారులు



అన్నంలో ఉన్న పురుగులను చూపుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి- కార్వేటినగరం

పేదరికంతో అల్లాడుతున్న నిరుపేద కుటుంబాల్లో పుట్టి విద్యాభ్యాసం కోసం పొట్టను చేతిలో పట్టుకుని వసతి గృహంలో చేరితే పురుగుల అన్నం, నీళ్ల సాంబారును వడ్డించి చులకన భావంతో చూస్తున్నారని కార్వేటినగరం ఎస్సీ వసతి గృహంలోని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత మూడు రోజులుగా అన్నంలో పురుగులు వస్తున్నా పట్టించుకోవడం లేదన్న విద్యార్థుల ఆరోపణలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

వసతి గృహంలోని విద్యార్థులకు గత మూడు రోజులుగా పురుగులతో కూడిన భోజనం వండి వడ్డిస్తున్నారు. దీంతో విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారు. అయినప్పటికీ అక్కడి అధికారులు నిర్లక్ష్యధోరణి వహిస్తూ పిల్లలను ఇబ్బంది పెడుతున్నారని వారి తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు. వెనుకబడిన తరగతి విద్యార్థుల పట్ల వెల్ఫేర్ అధికారులకు ఎంతటి చులకన భావం ఉందో ఇట్టే అర్థమవుతోందని పలువురు విమర్శిస్తున్నారు. ప్రతి విద్యాసంవత్సరం వసతి గృహాల్లో విద్యార్థులు తగ్గుముఖం పడుతున్నారంటే కారణం సంబంధిత వార్డెన్లు అని, అందుకు నిదర్శనమే ఈ సంఘటన అంటున్నారు. తరచూ పిల్లలకు ముద్దకట్టిన అన్నం, నీళ్ల సాంబారు తప్ప మరేమీ పెట్టడం లేదని, అప్పుడప్పుడు భోజనంలో పురుగులు కపిస్తున్నాయని తినలేక చాలీచాలని భోజనంతో నీళ్లు తాగి కడుపు నింపుకుంటున్నామని పిల్లలు వాపోతున్నారు. కనీసం ప్రభుత్వం ప్రతి విద్యార్థికి కేటాయిస్తున్న నిధుల ప్రకారం, మెనూ ప్రకారం అయినా పెట్టకుండా వారి జేబులు నింపుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఇది ఇలాగే కొనసాగితే విద్యార్థులు అస్థవ్యస్థతకు గురై అనారోగ్యపాలవుతారని, తమ పిల్లల పట్ల ఎందుకు ఇంత నిర్లక్ష్యమని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వసతి గృహాలను సందర్శించి పేద పిల్లలకు కనీసం మంచి భోజనం అందించాలని వారు వేడుకుంటున్నారు.

పాత బియ్యం కావడంతోనే సమస్య..

- వినాయక హాస్టల్ వార్డన్

ప్రతి రోజు బియ్యం గాలించి పురుగులు ఏమీ లేకుండా పిల్లలకు వండి వడ్డించడం జరుగుతుంది. నిన్నటి రోజున అన్నంలో పురుగులు ఉండడం పాత బియ్యం వల్ల వచ్చిందని, నేను ఇంకొక హాస్టల్ ఇన్చార్జిగా ఉండటంతో అక్కడ పేరెంట్స్ మీటింగ్కు వెళ్లడం జరిగింది. ఇంతవరకు ఇలాంటివి ఎప్పుడూ జరగలేదు,

మామిడి రైతుల నిరసనతో

దద్దరిల్లిన కలెక్టరేట్

- అడుగడుగునా పోలీసుల అడ్డంకులు
- అనుమతి లేదంటూ ఆంక్షలు
- భారీగా చిత్తూరుకు చేరుకున్న రైతన్నలు
- సంక్రాంతి లోపు బకాయిలు చెల్లించాలి..
- లేకుంటే పోరాటం ఉధృతం చేస్తామన్న మామిడి రైతులు, సంఘం నాయకులు

కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న దృశ్యం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

ప్రభుత్వం మాటిచ్చింది.. కలెక్టర్ ప్రకటించారు.. అయినా ప్రభుత్వ ఆదేశాలను లెక్కచేయకుండా మామిడి రైతులను దగా చేస్తున్న గుజ్జు పరిశ్రమల తీరును నిరసిస్తూ మామిడి రైతుల సంఘం పిలుపుమేరకు జిల్లాలోని మామిడి రైతులు సోమవారం చలో కలెక్టరేట్ కార్యక్రమంలో భారీగా పాల్గొని విజయవంతం చేశారు. రాజకీయ పార్టీల ఆందోళనలు, ర్యాలీలు, నిరసన కార్యక్రమాలకు అనుమతులు ఇచ్చే పోలీసు ప్రభుత్వం ప్రకటించిన టన్నుకు రూ.12వేల మద్దతు ధర కోసం పోరాడుతున్న రైతుల పట్ల కఠినంగా వ్యవహరించారు. తాము పండించిన పంటను గుజ్జు పరిశ్రమలకు ట్రాక్టర్లతో తోలి తమకు అందాల్సిన మద్దతు ఇవ్వమని ఫ్యాక్టరీల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిన రైతులు కడుపుమండి చలో కలెక్టరేట్ పిలుపునిస్తే.. అనుమతి లేదంటూ అడుగడుగునా పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. అన్నం పెట్టే రైతు తన గళాన్ని వినిపించేందుకు కూడా మైక్ పర్మిషన్ ఇవ్వకుండా తొక్కి పెట్టారు. చలో కలెక్టరేట్ కొచ్చిన మామిడి రైతుల ఆవేదన వినిపించే స్వేచ్ఛను కూడా ఇవ్వకుండా పోలీసు అధికారులు అడుగడుగున అడ్డుపడుతూ మామిడి రైతులను ఇబ్బంది పెట్టారు.

చలో కలెక్టరేట్కు బయలుదేరిన మామిడి రైతులను ఎక్కడికక్కడ పోలీసు యంత్రాంగం అడ్డుకొని అధికార పార్టీకి స్వామిభక్తిని చాటుకుంది. ఆంక్షలు అడ్డంకులను అధిగమించి దాదాపు 300 మందికి పైగా మామిడి రైతులు చిత్తూరు కలెక్టరేట్ వద్దకు చేరుకుని తమ నిరసన గళాన్ని వినిపించారు. సంక్రాంతి లోగా జిల్లాలోని మామిడి రైతులకు గుజ్జు పరిశ్రమలు పూర్తిస్థాయిలో ప్రభుత్వం ప్రకటించిన మేరకు రూ.8లు చెల్లించకుంటే జిల్లా వ్యాప్తంగా ఎక్కడికి అక్కడ జాతీయ రహదారుల దిగ్బంధనం, జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆమరణ నిరాహార దీక్షలకు పూనుకుంటామని మామిడి రైతుల సంఘం నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మామిడి రైతుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మునీశ్వర్‌రెడ్డి బంగారు మురళిలు మాట్లాడుతూ మామిడి పరిశ్రమలు ప్రభుత్వ ఆదేశానుసారం రైతులకు ఇవ్వాల్సిన బకాయిలను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. గుజ్జు పరిశ్రమలకు మామిడి కాయలను తోలి ఏడు నెలలుగా పూర్తి అయినా ఇప్పటివరకు రైతులకు ఇంకా డబ్బులు ఇవ్వకపోవడం దుర్మార్గమని అన్నారు. మళ్లీ మామిడి సీజన్కు పెట్టుబడులు పెట్టాల్సిన సమయం ఆసన్నమైనదని, బకాయిలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రైతులను మోసం చేసే 40 గుజ్జు ఫ్యాక్టరీల యాజామాన్యం వైపు ఉంటారా.. లేక 40వేల మంది మామిడి రైతుల పక్షాన ఉంటారో తెల్చుకోవాలని అన్నారు. మామిడి రైతులకు పరిశ్రమలు ఇప్పటికే ఇచ్చిన రూ.2, 3, 4, 5లు పోను మిగిలిన బకాయిలు కూడా వెంటనే చెల్లించాలన్నారు. వచ్చే సంవత్సరం మే నెలలోనే గుజ్జు పరిశ్రమలు ప్రారంభం చేయాలని, టేబుల్ రకాలు కాయలను రైతులు నేరుగా అమ్ముకోవడానికి పట్టణాల్లో ప్రభుత్వం తగిన ఏర్పాటు చేయాలని, మామిడి అనుబంధ ఉత్పత్తులను తయారు చేసుకోవడానికి, రైతులకు కోల్డ్ స్టోరేజీలు కుటీర పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం సహకరించాలని డిమాండ్ చేశారు. మామిడి పనులు, కొమ్మ కత్తిరింపులు, ఎరువులు వేయడం, దున్నడం మందుల పిచికారి, కాయలు కోయడం లాంటి పనులకు ఉపాధి హామీకి అనుసంధానం చేసి రైతులు ఆదుకోవాలని కోరారు.

సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు మాట్లాడుతూ గుజ్జు పరిశ్రమల వద్ద నిల్వ ఉన్న మామిడి పల్ప్‌ను తిరుమల తిరుపతి దేవస్థానం, ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో, మధ్యాహ్న భోజనం పథకం, అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తే యాజమాన్యాలు వద్ద నిల్వ ఉన్న పల్ప్ అమ్ముడుపోతుందని దీనికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. రైతు సంఘం నాయకులు రామానాయుడు మాట్లాడుతూ గతంలో అనేకమార్లు జిల్లా కలెక్టర్‌తో చర్చలు జరిపినా మామిడి రైతుల సమస్యలు పరిష్కరించకపోవడం దారుణమన్నారు. మామిడి రైతుల కన్నీరు రాష్ట్రానికి మంచిది కాదని, మామిడి రైతుల సమస్యలు పరిష్కరించకపోతే పంచాయతీ ఎన్నికలలో రైతులే ప్రభుత్వానికి తగిన బుద్ధి చెపుతారని అన్నారు. మామిడి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హేమలత మాట్లాడుతూ మామిడి రైతులు శాంతియుతంగా సమావేశం నడుపుకుంటుంటే నిర్బంధాలు చేయడం, మైకును పెట్టకుండా అడ్డుకోవడం, రైతులను చులకనగా మాట్లాడడం దుర్మార్గమైన చర్య అన్నారు. రైతుల సమస్యలను రాజకీయాలకతీతంగా పరిష్కరించాలని కోరారు. ఏఐటీయూసీ నాయకులు నాగరాజు మద్దతు తెలిపి వారి సందేశాన్ని అందించారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఓబుల్ రాజు, జానపద వృత్తి కళాకారుల సంఘం అధ్యక్షులు కేఎస్.రామచంద్రన్, ప్రధాన కార్యదర్శి రవి, వివిధ ప్రజాసంఘాలు మామిడి రైతులకు మద్దతు తెలిపారు. మామిడి రైతుల సంఘం నాయకులు కె.సురేంద్రన్, సంజీవరెడ్డి, మునిరత్నం నాయుడు, ఉమాపతి నాయుడు, సందీప్, మోహన్ రెడ్డి, త్యాగరాజు రెడ్డి, భారతమ్మ, చెంగల్ రాయరెడ్డి, జయదేవయ్య, బెల్లంకొండ శ్రీనివాసులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ సుమిత్‌కు మామిడి రైతుల సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ సాధ్యమైనంత త్వరగా మామిడి రైతుల సమస్యలపై గుజ్జు పరిశ్రమలతో చర్చించి న్యాయం చేస్తామని తెలిపారు. అలాగే డిడి మధుసూదన్ రెడ్డి మామిడి రైతుల వద్దకు వచ్చి జిల్లా కలెక్టర్ మరోమారు గుజ్జు పరిశ్రమల యజమానులతో మాట్లాడి మామిడి రైతులకు ఫ్యాక్టరీల నుండి చెల్లించాల్సిన డబ్బులను చెల్లించేలా చూస్తామని హామీ ఇచ్చారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు, రైతులు

ట్రైనీ పోలీస్ కానిస్టేబుళ్లకు

నేటి నుంచి 9 నెలలు శిక్షణ

కానిస్టేబుళ్ల శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: స్టైపెండరీ కేడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుళ్లకు 22వ తేదీ సోమవారం నుండి 9 నెలల పాటు ఇచ్చే శిక్షణ చిత్తూరు పట్టణంలోని జిల్లా పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో అధికారికంగా ప్రారంభమైంది. ఈ శిక్షణా కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా నుండి 61 మంది, విజయనగరం జిల్లా నుండి 78మంది మొత్తం 139 మంది కేడెట్ ట్రైనీలు చిత్తూరు జిల్లాకు చేరుకున్నారు. వీరందరికీ 9 నెలల పాటు శారీరక శిక్షణ, ఆయుధ వినియోగం, డ్రిల్, చట్టాలపై అవగాహన, ప్రజలతో మమేకమయ్యే విధానం, క్రమశిక్షణ, నైతిక విలువలు, పోలీస్ విధి బాధ్యతలు వంటి అంశాలపై సమగ్ర శిక్షణ అందించనున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ తుషార్ డూడి మాట్లాడుతూ శిక్షణాకాలంలో క్రమశిక్షణ, సమయపాలన, నిబద్ధత అత్యంత ముఖ్యమని, శిక్షణను పూర్తిగా వినియోగించుకుని ప్రతిఒక్కరూ ఉత్తమ పోలీస్ కానిస్టేబుల్‌గా ఎదగాలని సూచించారు. ఈరోజు ఉదయం ట్రైనీ కానిస్టేబుళ్లకు వైద్య పరీక్షలు నిర్వహించామని తెలిపారు. పోలీస్ విధుల్లో శారీరకంగా, మానసికంగా పూర్తిస్థాయిలో ఫిట్‌గా ఉండటం అత్యవసరమన్నారు. అలాగే జిల్లా పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో అవుట్‌డోర్, ఇండోర్ సిబ్బందికి అవసరమైన సూచనలు ఇప్పటికే జారీ చేశామని, ప్రతి ట్రైనీకి నాణ్యమైన శిక్షణ అందేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఈ బ్యాచ్ రాష్ట్రంలోనే ఉత్తమ ట్రైనీ బ్యాచ్‌గా నిలవాలని ఆకాంక్షించారు.

మొరాయిస్తున్న '104'

ఇబ్బంది పడుతున్న వైద్య సిబ్బంది

వెనుక నుంచి 104 వాహనాన్ని నెడుతున్న వైద్య సిబ్బంది, స్థానికులు

ప్రజాశక్తి- పెద్దపంజాణి: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల వద్దకే మెరుగైన వైద్యం అందించాలని ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 104 కార్యక్రమం ప్రజల వద్దకు చేరకపోగా వైద్య సిబ్బందికి ఇబ్బందిగా మారింది. సోమవారం శివాడి గ్రామంలో కాలంచెల్లిన 104 వాహనాలు ఎక్కడ నిలిస్తే అక్కడ ఆగిపోవడంతో వాహనాన్ని తోయాల్సిన పరిస్థితి.

ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రతిరోజు ఒక గ్రామానికి 104 వాహనం ద్వారా వైద్య సేవలు అందించడానికి వైద్య సిబ్బంది వాహనంలో వెళుతూ ఉంటారు గ్రామాలలో గర్భిణీ స్త్రీలు, వయోవృద్ధులు ఎప్పుడు 104 వాహనం వస్తుందని వేచి ఉంటారు. ఈ నేపథ్యంలో వాహనం అసలు స్టార్ట్ కాకుండా మొరాయించడంతో రోజు గ్రామస్తులు ఎవరూ సహకరించక పోవడంతో సిబ్బంది వాహనాన్ని తోసుకుంటూ వెళ్లి స్టార్ట్ అయిన తర్వాత వెళ్ళవలసిన దుస్థితి నెలకొంది. అనేకసార్లు సంబంధిత అధికారులు దృష్టికి సమస్యను తీసుకెళ్లినా ప్రయోజనం లేదని సిబ్బంది విచారం వ్యక్తం చేస్తున్నారు. గత మూడు నెలలుగా సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. ఈ నేపథ్యంలో గ్రామానికి సమయానికి 104 వాహనం వెళ్లకపోతే పై అధికారులు తమపై మండిపడుతున్నారని వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే 104 వాహనాన్ని మరమ్మతులు చేపట్టి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని ప్రజలు కోరుతున్నారు.

యుటిఎఫ్ జిల్లా కమిటీ ఎన్నికలు ఏకగ్రీవం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్



అధ్యక్ష కార్యదర్శులు రెడ్డప్ప నాయుడు, ఎన్.మణిగండన్

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ చిత్తూరు జిల్లా ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగినట్లు ఎన్నికల అధికారి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్, పరిశీలకులు రాష్ట్ర కార్యదర్శి జీవీ.రమణ తెలిపారు. జిల్లా నూతన అధ్యక్షులుగా రెడ్డప్ప నాయుడు (పూతలపట్టు), ప్రధాన కార్యదర్శిగా ఎన్.మణిగండన్ (విజయపురం), గౌరవ అధ్యక్షులుగా కే.సదాశివరెడ్డి (పులిచర్ల), సహాధ్యక్షులుగా ఎస్.రెహనా బేగం (యాదమరి), డి.ఏకాంబరం (ఐరాల), జిల్లా కార్యదర్శులుగా గాలి సురేష్ (కుప్పం), బి.ఈశ్వర మహేంద్ర (పులిచెర్ల), ఎం.పార్థసారథి (పెనుమూరు), పంటపల్లి సురేష్ (యాదమరి), పీసీ బాబు (గంగవరం), ఎం.శ్రీనివాసులు (పెద్దపంజాణి), ఎం.శశికుమార్ (బైరెడ్డిపల్లి), కే వంశీకృష్ణ (విజయపురం), బి.రామ్మూర్తి నాయక్ (రామకుప్పం), రాష్ట్ర కౌన్సిలర్లుగా ఎం. సోమశేఖర నాయుడు (ఐరాల), టి.రఘుపతి రెడ్డి (శాంతిపురం), కె.దీనావతి (ఎస్ఆర్ పురం), ఎస్పీ బాషా (పూతలపట్టు)లను ఎన్నుకున్నారు. అలాగే జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా వెంకటేశులు (కార్వేటినగరం), సభ్యులుగా వి.సాధన కుమార్ (ఎస్ఆర్.పురం) కె.జయరాజ్ (నింద్ర), డి.రవీంద్రబాబు (నగరి), కె.మోహన్ రెడ్డి (బంగారు పాల్యం), వి.భాస్కర్ (పలమనేరు), మహిళా కమిటీ కన్వీనర్ డి.మంజులరాణి (పలమనేరు), ఐక్య ఉపాధ్యాయ కన్వీనర్ కె.మురళీకృష్ణ (నగరి), సిపిఎస్ కమిటీ కన్వీనర్ జి.సుధాకర్ (ఐరాల), ప్రచురణాల కమిటీ కన్వీనర్ జి.రవీంద్ర (చిత్తూరు), స్టడీ సర్కిల్ కన్వీనర్ వి.యువరాజు (పాల సముద్రం), సోషల్ మీడియా కన్వీనర్ ఎం.మోహన్ (బైరెడ్డిపల్లి), సాంస్కృతిక కమిటీ కన్వీనర్ బివి.రమణ (పెద్ద పంజాణి) తదితరులను ఎన్నుకోవడం జరిగింది. నూతనంగా ఎన్నికైన కమిటీ విద్యారంగ పరిరక్షణ కోసం, ఉపాధ్యాయ సంక్షేమం నిమిత్తం రాజీ లేకుండా కృషి చేస్తామని తెలిపారు.

అర్జీలను నాణ్యతగా పరిష్కరించాలి : కలెక్టర్

పిజిఆర్ఎస్‌కు 353 వినతులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పిజిఆర్ఎస్ అర్జీలను నాణ్యతగా పరిష్కరించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ సమావేశం మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం) కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ఆయా మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. కలెక్టర్‌తో పాటు డిఆర్ఓ మోహన్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్ర పాడేల్, ఆర్డీవో శ్రీనివాసులు, డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి, డిప్యూటీ కలెక్టర్ కరుణ కుమారి, కలెక్టరేట్ ఏవో వాసుదేవన్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారవేదిక అర్జీలకు సంబంధించిన ఆడిట్‌ను జిల్లా అధికారులు ప్రాధాన్యతగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం 353 అర్జీలను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ఇందులో శాఖల వారీగా అర్జీల వివరాలు ఇలా ఉన్నాయి. రెవెన్యూ, సర్వే డిపార్ట్మెంట్ 220, పంచాయతీ రాజ్ శాఖ 2, పోలీస్ శాఖ 11, అగ్రికల్చర్ 2, డీఈవో 3, సిపిఓ 1, వైద్య ఆరోగ్యశాఖ 7, హార్టికల్చర్ 1, డిఆర్డిఏ పీడీ 77, సివిల్ సప్లై 4, విభిన్న ప్రతిభావంతులు 1, సర్వశిక్షణ అభియాన్ 6, హౌసింగ్ 2, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ 2, వాటర్ రిసోర్సెస్ 2, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ 4, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ 2, ఏపిఎస్ ఆర్‌టిసి 2, ఎంపిడిఓ గుడిపాల 1, ఎంపిడిఓ తవణంపల్లి 1, ఎంపిడిఓ యాదమరి 1, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ 1, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులు సమస్యలను జిల్లా కలెక్టర్, ఆర్డిఓ, డిఆర్ఓ, డిప్యూటీ కలెక్టర్‌కు వివరించి అర్జీలను అందజేశారు.

ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

సమస్యలను అలసత్వం చేయకండి : ఎస్పీ

చిత్తూరు అర్బన్: ప్రజాఫిర్యాదుల పరిష్కారం కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్టప్రకారం విచారణ జరిపి నిర్దేశించిన గడువులోగా ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్పి తుషార్ డూడి ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలపై న్యాయం పొందేలా నిబద్ధతతో పనిచేయాలన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు ఎస్పి, అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్, అడ్మిన్ ఇంచార్జ్ ఎస్ఆర్.రాజశేఖరరాజు, చిత్తూరు సబ్ డివిజన్ డీఎస్పీ టి.సాయినాథ్‌ని కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ప్రతి ఫిర్యాదును సమగ్రంగా పరిశీలించి త్వరితగతిన విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యమని ఎస్పి తెలిపారు. సోమవారం కార్యక్రమంలో చీటింగ్ 2, కుటుంబ తగాదాలు 6, వేధింపులు 4, ఇంటి తగాదాలు 2, భర్త వేధింపులు 1, భూ తగాదాలు 18, డబ్బు తగాదాలు 6, చిన్న గొడవలు 1, పోలీసు సేవలు 5, ఆస్తి తగాదాలు 5 ఫిర్యాదులు అందాయి.

ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ తుషార్‌డూడి

పీజీఆర్ఎస్‌కు 8 వినతులు : కమిషనర్

చిత్తూరు అర్బన్: ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో అందే వినతులను వేగంగా పరిష్కరించాలని కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి 8 వినతులు స్వీకరించినట్లు తెలిపారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులపై అక్కడిక్కడే అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. గత వారం అందిన వినతుల పరిష్కారంపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం 3, టిడ్కో గృహాలు 5, ఫించన్లు1, కార్యాలయం 1 చొప్పున మొత్తం 8 వినతులు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ వెంకటరామిరెడ్డి, ఏసీపీ నాగేంద్ర, ఆర్వో గోపాలకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

అర్జీలను స్వీకరిస్తున్న కమిషనర్ నరసింహ ప్రసాద్

ఏపీలో పరిశ్రమలకు ప్రభుత్వ ప్రోత్సాహం

- కుప్పంలో పరిశ్రమల పురోగతిపై సమీక్ష
- ఇండస్ట్రియల్ ఏరియా పరిశీలన
- ఏపీఐఐసీ ఎండి అభిషేక్ కిషోర్

ప్రజాశక్తి- కుప్పం: ఏపీలో పరిశ్రమలు ఏర్పాటుకు ప్రభుత్వం ఎంతగానో సహకరిస్తూ ప్రోత్సాహాన్ని అందిస్తోందని ఏపీఐఐసీ ఎండి అభిషేక్ కిషోర్ పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు సొంత నియోజకవర్గ కుప్పం నియోజకవర్గంలో పరిశ్రమల పురోగతిపై సోమవారం కడ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో ఏర్పాటు అవుతున్న పరిశ్రమల గురించి కడ పీడీ వికాస్ మర్మత్ వివరించారు. నియోజకవర్గంలో పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, భూముల కేటాయింపు, విద్యుత్, నీటి సరఫరా వంటి అంశాలపై విస్తృతంగా సమీక్షించారు. పరిశ్రమల స్థాపనలో ఎదురయ్యే సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు చేశారు. అనంతరం పీడీ వికాస్ మర్మత్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రేమ్ కుమార్‌తో కలసి కుప్పం, గుడిపల్లి మండలాల పరిధిలో ఇండస్ట్రియల్ ఏరియాను పరిశీలించారు. ఇండస్ట్రియల్ ఏరియాలో వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న పరిశ్రమలను ఏపీఐఐసీ ఎండి పరిశీలించి నిర్మాణ పనులను వర్తికతను పూర్తి చేయాలని సూచించారు. అదేవిధంగా పరిశ్రమలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించాలని ఏవైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. పరిశ్రమలు ఏర్పాటుతో నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. కుప్పం నియోజకవర్గంలో ఇటీవల సీఎం చంద్రబాబు వర్చువల్ విధానంలో శంకుస్థాపనలు చేసిన పరిశ్రమల పురోగతిపై ఆరా తీశారు. పి.కె.ఎం ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు, కడ అడ్వైజర్ కమిటీ సభ్యులు సుగుణమ్మ, సతీష్, గుడిపల్లి మండల అధ్యక్షుడు సుబ్బు, నాయకులు బాబు, ఆర్డీవో శ్రీనివాసరాజు, జెడ్ఎం ఇండస్ట్రీస్ ప్రతినిధులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కడా పీడీ

ఈ- ఆటోలు పంపిణీ

ఈ- ఆటోలను ప్రారంభిస్తున్న ఎంపి, కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: గ్రామ పంచాయతీలలో పారిశుధ్యం మెరుగు కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీసుకున్న చర్యల్లో భాగంగా ఎంపి లాడ్స్ కింద గంగాధర నెల్లూరు మండలానికి 20 ఈ-ఆటోల పంపిణీ చేపట్టామని చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు పేర్కొన్నారు. సోమవారం జిల్లా సచివాలయ ప్రాంగణంలో గంగాధర నెల్లూరు మండలానికి సంబంధించి పంపిణీ చేసిన 20 ఈ - ఆటోలను చిత్తూరు ఎంపి, ప్రభుత్వ విప్, గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఎంఎల్ఏ వి.ఎం.థామస్, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ప్రారంభించారు. ఎంపి మాట్లాడుతూ చిత్తూరు పార్లమెంట్ పరిధిలో గల 7 అసెంబ్లీ నియోజకవర్గాలలో ఉన్న మేజర్ పంచాయతీలు, గ్రామ పంచాయతీలలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టామని తెలిపారు. ఇందులో భాగంగా ప్రస్తుతం గంగాధర నెల్లూరు నియోజకవర్గం గంగాధర నెల్లూరు మండలానికి ఎంపి లాడ్స్ కింద రూ.63 లక్షలతో 20 ఈ - ఆటోలు పంపిణీ చేయడం చేయడం జరిగిందన్నారు. భవిష్యత్తులో మిగిలిన అన్ని నియోజకవర్గాలకు పంపిణీ చేస్తామన్నారు. ఈవాహనాల ద్వారా గ్రామాల్లో చెత్త సేకరణ, తొలగింపు కార్యక్రమాలు చేపడతామన్నారు. ఇవి కాక కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా మరిన్ని వాహనాలను సమకూర్చే ఏర్పాటు చేస్తామన్నారు. ఎంఎల్ఏ మాట్లాడుతూ ఈ ఆటోల సహాయంతో తడి, పొడి చెత్తను విడి విడిగా సేకరించడానికి వీలు పడుతుందన్నారు. చెత్త సేకరణ నిరంతర ప్రక్రియగా చేయడం ద్వారా గ్రామాల్లో డెంగి, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా ప్రజారోగ్యాన్ని కాపాడుకోగలమని అన్నారు. చెత్త సేకరణ అనంతరం చెత్త నుండి సంపద కార్యక్రమంలో భాగంగా వర్మీ కంపోస్ట్, సేంద్రీయ ఎరువుల తయారీ కార్యక్రమం చేపడతామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎంపి లాడ్స్ కింద జిల్లాలో ఎస్సి, బీసీ హాస్టల్‌లలో, ప్రభుత్వ ఆస్పత్రులు, పాఠశాలల్లో మౌలిక వసతుల సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. ఇప్పటివరకు ఎంపీ నిధుల నుండి సుమారు రూ.4కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఇటీవల కన్నన్ బాలికల కళాశాలలో రూ.30లక్షల నిధులతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ఎంపి లాడ్స్ కింద 9 ప్రాజెక్టులను విజయవంతంగా అమలు చేయడం జరిగిందన్నారు. గంగాధర నెల్లూరు మండలానికి అందించిన 20 ఈ-ఆటోల ద్వారా ఇంటింటి చెత్త సేకరణ మరింత సమర్థవంతంగా చేపడతామన్నారు. చిత్తూరు నగరపాలక సంస్థ మేయర్ అముద, చూడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, డిపిఓ సుధాకర్ పాల్గొన్నారు.

యువజనోత్సవాలలో చిత్తూరు జిల్లా మొదటి స్థానం

విజేతలను అభినందించిన కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: వివేకానందస్వామి జయంతి సందర్భంగా ప్రభుత్వం నిర్వహించే జాతీయ యువజనోత్సవాలు విజయవాడలో రాష్ట్ర యువజన సర్వీసులశాఖ ఆధ్వర్యంలో ఈనెల 19న గుంటూరులోని కెఎల్‌యూనివర్సిటీలో నిర్వహించడం జరిగింది. యువజనోత్సవాల్లో చిత్తూరు జిల్లా తరఫున పాల్గొన్న పవన్ గ్రూప్ రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థాయిలో నిలవడం జరిగింది. దీంతో సోమవారం జిల్లా కలెక్టర్ విజేతలైన పవన్ గ్రూప్ (జానపద నృత్యం (గ్రూప్)ను అభినందించారు. జానపద నృత్యంలో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన వీరికి శ్రీ వివేకానంద స్వామి జయంతి సందర్భంగా 12, జనవరి, 2026న న్యూఢిల్లీలో జరిగే జాతీయస్థాయి యువజనోత్సవాలలో పాల్గొనుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున అర్హత పొందారని కలెక్టర్ తెలిపారు.

జిల్లాలోని 31,929 మంది రైతుల ఖాతాలకు

రూ.146.84 కోట్లు సబ్సిడీ జమ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: మామిడి రైతులకు ఇచ్చిన మాట ప్రకారం జిల్లాలోని 31,929 మంది రైతుల ఖాతాలకు రూ.146.84 కోట్లు సబ్సిడీని రాష్ట్ర ప్రభుత్వం జమ చేసినది జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా మామిడి రైతుల సమస్యలపై రైతుల వినతుల అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వారితో మాట్లాడుతూ మామిడి రైతుకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని తెలిపారు. జిల్లాలో మామిడికాయల బోర్డులు ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, చిత్తూరు జిల్లా ఎంపీ కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్ళిపోవడం జరిగిందని కలెక్టర్ రైతులకు వివరించారు. జిల్లాలోని తోతాపురి మామిడి రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని ప్రతి రైతు వివరాలు సేకరించి వారి ఖాతాలకే ప్రభుత్వం సపోర్టింగ్ ధర రూ.4లు కేజీ చొప్పున జమ చేయడం జరిగిందని వివరించారు. కార్యక్రమంలో రైతులు మురళి, విశ్వేశ్వర్ రెడ్డి, వెంకటరెడ్డి, జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఎస్సీఏసీ ఆధ్వర్యంలో కొంబోళ్ల జనతా గోడ పత్రికను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.

పంచాయతీ విభజనకు ఆమోదం

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: తూగుండ్రం పంచాయతీ విభజనకు ప్రజలు ఆమోదం తెలిపారు. మండలంలోని తూగుండ్రం పంచాయతీ విభజనకు పంచాయతీ పరిధిలోని ఆవలకొండ, కండిగ దళితవాడ, అరిమాకులపల్లి, ఆరిమాకులపల్లి దళితవాడ, తొప్పసపల్లి, తొప్పసపల్లి ఆది ఆంధ్రవాడ, దాసరపల్లి, దాసరపల్లి ఎస్సీ కాలనీ, దాసరపల్లి ఆదిఆంధ్రవాడ, మోహావూరం, తొప్పగుంట గ్రామస్తులు రెండు రోజుల క్రితం డిపికు వినతిపత్రం సమర్పించారు. ఇందులో భాగంగా సోమవారం సర్పంచ్ బాబు, ఎంపీటీసీ వాణిశ్రీ కేశవులు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపిడివో శివయ్య మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో కొంతమంది గ్రామస్తులు విభజన కోరుతూ జిల్లా ఉన్నతాధికారులకు కలిసి ఇచ్చిన వినతిపత్రం మేరకు గ్రామసభ పెట్టామన్నారు. పంచాయతీ ఉమ్మడిగా ఉండాలన్న, విభజించాలన్నా వారి అభిప్రాయాలను ప్రజలు తెలియజేయవచ్చని తెలిపారు. గ్రామసభలో ప్రజలు తెలియజేసిన అభిప్రాయాలను సంతకాలు చేసిన రికార్డు వివరాలను జిల్లా ఉన్నత అధికారులకు పంపిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి శిరీష, సచివాలయం ఉద్యోగులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి- పలమనేరు: నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పలమనేరు శాసనసభ్యులు అమరనాథ రెడ్డి తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించబడ్డ తవణంపల్లి మండలంనకు చెందిన వై.సునీల్ కుమార్ చౌదరికి సూచించారు. సోమవారం సునీల్ కుమార్ చౌదరి ఎమ్మెల్యేను వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రవి ప్రసాద్, నాయకులు సమీర్ చౌదరి, శివకుమార్, ప్రకాష్, సుధీష్, సురేష్, రెడ్డప్ప, బలరాంరెడ్డి పాల్గొన్నారు.

సత్తాచాటిన కార్వేటినగరం ఉద్యోగి

ప్రజాశక్తి- కార్వేటినగరం: చిత్తూరు జిల్లా రెవెన్యూ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న క్రీడాపోటీల్లో కార్వేటినగరం రెవెన్యూ సిబ్బంది సత్తాచాటినట్లు మండల తహశీల్దార్ నాగరాజు తెలిపారు. రెవెన్యూ భవనంలో రెవెన్యూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన చెస్ పోటీలో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్గా విధులు నిర్వహిస్తున్న ఎన్.శివగణేష్ ప్రతిభ కనబరిచారని తెలిపారు. తహశీల్దార్ నాగరాజు, సిబ్బంది అభినందించారు.

జిల్లా సర్వేయర్ల చెస్ పోటీలలో

విజేతగా మురళికృష్ణ

ప్రజాశక్తి- చౌడేపల్లి: జిల్లా సర్వేయర్లకు జరిగిన చెస్ పోటీలలో మురళీకృష్ణ విజేతగా నిలిచాడు. చౌడేపల్లి సర్వేయర్‌గా పనిచేస్తున్న మురళీకృష్ణ జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లాస్థాయి సర్వేయర్ల చెస్ పోటీలలో మొదటి స్థానంలో నిలిచి అందరి మన్ననలు పొందారు. దీంతో స్థానిక సర్వేయర్లు రెవెన్యూ అధికారులు ఆయనను అభినందించారు.

మైనార్టీ నేతలకు సన్మానం

ప్రజాశక్తి -కుప్పం : టిడిపి మైనార్టీ నేతలను మున్సిపల్ టిడిపి మహిళ నేతలు ఘనంగా సత్కరించారు. టిడిపి మైనార్టీ సెల్ కుప్పం నియోజకవర్గ అధ్యక్షులుగా రెండవసారి ఎంపికైన జాకీర్‌తో పాటు మున్సిపల్ పార్టీ అధ్యక్షుడు ఉమర్, కమిటీ సభ్యులు జాబు, జావిద్‌లను మున్సిపల్ మహిళా అధ్యక్షురాలు శారదమ్మ, రాధా, షాహీ మహల్ డైరెక్టర్ హసీనాజ్, గీతమ్మ, శశికళ సత్కరించారు. నూతన మైనార్టీ కమిటీ ద్వారా గ్రామీణస్థాయిలో పార్టీ క్యాడర్ మరింత బలోపేతం అవుతుందని మహిళ నేతలు ఆశాభావం వ్యక్తం చేశారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: పదవ తరగతి విద్యార్థులకు యుటిఎఫ్ తయారుచేసిన స్టడీ మెటీరియల్ మార్గదర్శకమని ప్రధానోపాధ్యాయులు పారిజాతం అన్నారు. సోమవారం మండలంలోని తుంబపాల్యం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ స్టడీ మెటీరియల్‌ను గ్రామానికి చెందిన బలరాం యాదవ్ సహకారంతో పంపిణీ కార్యక్రమం జరిగింది. ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ యుటిఎఫ్ మాజీ మండల అధ్యక్షులు మునిరత్నం చొరవతో అందివ్వడం చాలా ఉపయోగమని, పాఠశాలలో 14మంది పదో తరగతి విద్యార్థులు విద్య అభ్యసిస్తున్నారని పేర్కొన్నారు. స్టడీ మెటీరియల్‌ని ప్రశ్నపత్రాలు పరిశీలించి అవగాహన పెంచుకుంటే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. ఉపాధ్యాయులు హరిప్రియ, గంగాభవాని, బాబు, దామోదర్, గిరిధర్ నాయుడు, వినీల, పుష్పిణి, విద్యార్థులు పాల్గొన్నారు.

కొండలను తోడేస్తున్నారు..

ప్రజాశక్తి- విజయపురం: విజయపురం మండలం మహారాజపురం కొండలను కొందరు అక్రమార్కులు తోడేస్తున్నారు. స్థానిక రాజకీయ నాయులు, అధికారుల అండదండలతో వీరి అవినీతికి అడ్డుఅదుపు లేకుండాపోయింది. గోరంత అనుమతితో కొండలను తవ్వేస్తున్నారు. రోజుకి 200 టిఫర్లలో లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తరలించి కోట్లు గడిస్తున్నారు. అధికారులకు చెప్పినా ఏమాత్రం పట్టించుకోలేదు. స్థానిక ప్రజలు చాలాసార్లు అడ్డుకొన్నా.. మండల, జిల్లా స్థాయి అధికారులు తమకు ఏమి తెలియనట్లు మామూళ్ల మత్తులో నిద్రబోతున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.

గోరంత అనుమతి..కొండంత తవ్వకాలు

మూడు నెల క్రితం రెండు ప్రైవేట్ సంస్థలు క్వారీ అనుమతి కోసం అర్జీలు పెట్టుకొన్నారు. వీరికి ఒక సంస్థకి 15వేల క్యూబిక్ మీటర్, మరో సంస్థ 16వేల క్యూబిక్ మీటర్లకి అనుమతి ఇచ్చారు. అయితే ప్రస్తుతం ఈ రెండు సంస్థలు గత మూడు నెలలుగా నకిలీ బిల్లుతో సుమారు లక్షల క్యూబిక్ మీటర్ల పైగా మట్టిని తరలిస్తున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదు. గతంలో నకిలీ బిల్లుతో తరలిస్తున్న టిప్పర్లలను స్థానిక ప్రజలు రెడ్‌హ్యాండ్‌గా అధికారులకు పట్టించినా చర్యలు తీసుకోకపోవడం లేదంటే అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది.

రోజుకి 200 టిప్పర్లు....

మహారాజపురం కొండపై నిత్యం 10 ఫోక్లీన్, 200 టిప్పర్లు నిత్యం తిరుగుతున్నాయి. ఒక టిఫర్‌లో 12 క్యూబిక్ చొప్పున రోజుకి 200 టిఫర్లలు తిరుగుతున్నాయి. ఇలా రోజుకి 3వేల క్యూబిక్ మీటర్ పైగా మట్టి తరలించేస్తున్నట్లు స్థానిక ప్రజలు అంటున్నారు. ఈ ప్రకారం పై రెండు సంస్థలు తత్కాలికంగా తీసుకొన్న అనుమతి ప్రకారం 15 రోజుల్లో మట్టి అంత తరలించేశారు. కానీ గత మూడు నెలలుగా నకిలీ బిల్లుతో మట్టిని తరలిస్తూ, కోట్ల రూపాయల ఆస్తిని సంపాదించేస్తూ, రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం లేకుండా చేస్తున్నారు.

రాజకీయ నాయకుడు హస్తం

అక్రమ క్వారీ యజమాన్యం వెనుక ఓ రాజకీయ నాయకుడి హస్తంగా బలంగా ఉండడంతో పగలు, రాత్రి తేడా లేకుండా మట్టి తరలించేస్తున్నారు. దీంతో ప్రభుత్వానికి కోట్ల రూపాయలు ఆదాయం గట్టి పడింది. క్వారీ యజమాన్యం వెనుక ఆ రాజకీయ నాయకుడుకి హస్తం ఉండడంతో స్థానిక ప్రజలు, మండల, జిల్లాస్థాయి అధికారులు సైతం వారి వైపు వెళ్లడానికి భయపడుతున్నారు.

అధికారులు పట్టించుకోలేదు

గత మూడు నెలలుగా నకలీ బిల్లులతో మట్టిని తరలిస్తున్నారు. రెడ్‌హ్యాండ్‌గా పట్టించాం. తనిఖీ పేరుతో కొంత మేర డబ్బు జరిమానాగా కట్టించుకుని వదిలేశారు. అయినా వాళ్లు మళ్లీ నకిలీ బిల్లులతో మట్టిని తరలిస్తుంటే అధికారులు మాత్రం పట్టించుకోలేదు. రోజుకి 200లకు పైగా టిప్పర్లు పగలు, రాత్రి తిరుగుతూ ఉంటాయి. ఇల్లు రోడ్డు పక్కనే ఉండడంతో పిల్లలను బయటకు వదలాంటే భయపడుతున్నారు. భారీ వాహనాల వలన ఇటీవల వేసిన రోడ్డు గుంతలు ఏర్పాడి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది.

- మాజీ ఎంపీటీసీ శివకుమార్, మహారాజపురం.

కొండలు తరిగిపోతున్నాయి..

మా ఊరులో కొండలు గతంలో పచ్చగా ఉండేది. క్వారీ పేరుతో మట్టిని తీసివేయడంతో కొండలు తరిగిపోతున్నాయి. పచ్చగా ఉన్న కొండలు గులకరాళ్లతో దర్శనమిస్తున్నాయి. తమిళనాడులోని ఇంటి నిర్మాణానికి ఎక్కువుగా ఇక్కడి నుంచి మట్టిని తీసుకెళ్లుతున్నారని తెలిసింది. అయినా మేము ఏమి చేయలేకపోతున్నాం. పై అధికారులు కూడా పట్టించుకోలేదు.

- దేగా సతీష్‌యాదవ్, పాతర్కాడు.

సహజ సంపద దోపిడిని అరికట్టండి

కలెక్టరేట్ ఎదుట వినూతన్న నిరసన

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: అధికార ప్రతిపక్ష పార్టీల నాయకులు నగరి నియోజకవర్గంలో సహజ సంపదలను లూటీ చేస్తూ తమిళనాడుకు తరలిస్తున్నారంటూ సోమవారం తెలుగుదేశం పార్టీకి చెందిన రామానుజం చలపతి నిరసన తెలిపారు. ఇసుక, మైనింగ్, చౌక బియ్యం అక్రమంగా తమిళనాడుకు తరలిస్తుంటే స్థానిక తహశీల్దార్, జిల్లా అధికారులు ఏమాత్రం పట్టించుకోకుండా నిద్రావస్థలో ఉన్నారని ఆరోపించారు. దినపత్రికల్లో నగిరిలో చోటుచేసుకుంటున్న సహజ సంపద దోపిడీ విషయాలను ప్రచురితమవుతున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా మేల్కొని సహజ సంపదను పరిరక్షించాలని కోరారు.

అడ్వకేట్లు విధులు బహిష్కరణ

ప్రజాశక్తి -కుప్పం : కుప్పం బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ కొత్తపల్లి ఉదయ్ కుమార్‌పై కుప్పం పోలీసులు ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడాన్ని నిరసిస్తూ కుప్పం బార్ అసోసియేషన్ సభ్యులు 3రోజులపాటు విధులను బహిష్కరించినట్లు బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ వెంకట రమణ తెలిపారు. సివిల్ కేసులు పెండింగ్లో ఉన్న ప్రతివాది భార్య ఇచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో పోలీసులు అడ్వకేట్ ఉదయ్ కుమార్‌పై కేసు నమోదు చేయడం బాధాకరమని, దీంతో విధులు బహిష్కరించినట్లు ఆయన తెలిపారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్పెషల్ క్యాంప్

ప్రజాశక్తి- గుడుపల్లి: ద్రావిడ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.హేమలత ఆధ్వర్యంలో సోమవారం యామగానిపల్లెలో రెండోరోజు స్పెషల్‌క్యాంప్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా యామగానిపల్లి గ్రామపరిసరాలు పరిశుభ్రతలో విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు. డాక్టర్ రామానుజన్ మ్యాథమెటిక్స్ డేసందర్భంగా రామానుజన్ చేసిన సేవలను విద్యార్థులకు తెలియజేశారు. సచివాలయ సెక్రెటరీ బాబు, డాక్టర్ మారియప్పన్, వాసు, తమిళశాఖ పరిశోధక విద్యార్థులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

చేపల చెరువుల వేలంపాటలో

పంచాయతీలకు భారీ ఆదాయం

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి : మండలంలోని ఆలపల్లి, గొల్లచీమలపల్లి గ్రామపంచాయతీల్లో చేపల చెరువుల వేలంపాట ఉత్సాహంగా సాగింది. సోమవారం డిప్యూటీ ఎంపీడీవో నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేలంపాటలో పంచాయతీలకు భారీ ఆదాయం లభించింది. ఈ వేలంపాటలో ఆలపల్లి గ్రామపంచాయతీకి రూ.46,500లు ఆదాయం సమకూరగా, గొల్లచీమలపల్లి గ్రామ పంచాయతీకి రూ.1,87,000లు ఆదాయం లభించింది. ఆలపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శులు డి.రవికుమార్, బి.చంద్రశేఖర్, సచివాలయ సిబ్బంది, గ్రామ మత్స్యకారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పాడి రైతుకు చెక్కు పంపిణీ

ప్రజాశక్తి- ఎస్ఆర్ పురం: పాడి రైతుల అభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ వి.థామస్ అన్నారు. గత అక్టోబర్ మొంథా తుఫాన్ ప్రకృతి విపత్తులో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెక్కులను సోమవారం అందజేశారు. ముద్దిగుప్పం గ్రామపంచాయతీ ఎన్టీఆర్ కాలనీకి చెందిన పాడి రైతు కందస్వామి దూడ తుఫానులో మృతి చెందడంతో ప్రభుత్వం తరపున నష్ట పరిహారంగా రూ.20వేలను పశువైద్యాధికారి శ్రీవిద్య ఆధ్వర్యంలో బాధితుడికి అందించారు.

దివ్యాంగులకు విద్యా సామగ్రి అందజేత

ప్రజాశక్తి- విజయపురం (నగరి): స్థానిక భవిత పాఠశాలలోని దివ్యాంగులకు నగరి మున్సిపల్ కౌన్సిలర్ గోపాల్ రెడ్డి సోమవారం డ్రాయింగ్ మెటీరియల్, ఆర్ట్ వర్కు పుస్తకాలు, అల్పాహారం అందించారు. సోమవారం పాఠశాలకు వెళ్లిన ఆయన తన భార్య జీవరత్నం జ్ఞాపకార్థం దివ్యాంగులకు అభ్యసనా సామగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రీదేవి, భవిత నిర్వాహకులు భవాని తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులందరికీ హెల్త్ చెకప్ చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలోని వివిధ సంక్షేమ వసతి గృహాలను, పాఠశాలలో మిడ్ డే మీల్స్‌ను మండల ప్రత్యేక అధికారులు తనిఖీలు చేయాలని, విద్యార్థులందరికీ హెల్త్ చెకప్ చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లాలోని అన్ని మున్సిపాలిటీ కమిషనర్లతో, జిల్లా అధికారులతో, మండలాల స్పెషల్ అధికారులతో సంక్షేమ వసతి గృహాలపై, ముస్తాబు కార్యక్రమాలపై సంబంధిత అధికారులకు దిశాదశ నిర్దేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో బాబు రాజేంద్ర ప్రసాద్, సర్వశిక్ష అభియాన్ పీవో వెంకటరమణ, ఐసిడిఎస్ పీడీ వెంకటేశ్వరి, డ్వామా పీడీ రవికుమార్, గిరిజన సంక్షేమ అధికారి మూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో స్థిరమైన వ్యక్తిగత పరిశుభ్రత అలవాట్లు, పరిశుభ్రతకు సంబంధించిన వ్యాధుల సంభవం తగ్గింపుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ముస్తాబు కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో క్రమబద్ధమైన చేతులు కడగడం, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యకరమైన అలవాట్లను ప్రోత్సహించడాన్ని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, పాఠశాల దినచర్యలో భాగంగా సులభమైన, నిర్మితమైన, క్రమమైన పరిశుభ్రత చర్యలను సమీకరించడం ద్వారా, పిల్లల ఆరోగ్యం, హాజరు, సమగ్ర సంక్షేమంపై సానుకూల ప్రభావం చూపవచ్చు అని ఈ కార్యక్రమం నిరూపిస్తుందన్నారు. ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించినప్పుడు సంక్షేమ గృహాలు సందర్శించినప్పుడు విద్యార్థులు శుభ్రమైన యూనిఫాం, పాదరక్షలు, కత్తిరించిన గోర్లు, శుభ్రమైన జుట్టు పరిశీలించాలని తెలిపారు.

టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శిగా సునీల్ కుమార్ చౌదరి

ప్రజాశక్తి- తవణంపల్లి: జిల్లా తెలుగుదేశం పార్టీ (టీడీపీ) ప్రధాన కార్యదర్శిగా సునీల్ కుమార్ చౌదరిని నియమిస్తూ పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు జిల్లా పార్టీ నాయకత్వం తవణంపల్లి మండలానికి చెందిన సునీల్ కుమార్ చౌదరిని జిల్లా ప్రధాన కార్యదర్శిగా సోమవారం అధికారికంగా ప్రకటించింది. సునీల్ కుమార్ చౌదరి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, మంత్రి నారా లోకేష్‌కు, ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావుకు, ఎమ్మెల్యే మురళీ మోహన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎంపికైన సందర్భంగా నూతన ప్రధాన కార్యదర్శి సునీల్ కుమార్ గుంటూరు మాజీ పార్లమెంటు సభ్యులు, అమర రాజా ఫ్యాక్టరీ ఎండీ గల్లా జయదేవ్‌ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. క్లస్టర్ కో-కన్వీనర్ అరగొండ కంప్యూటర్ శివ, వల్లేరు జయప్రకాశ్ నాయుడు, కార్యనిర్వాహక కార్యదర్శి పాలేటి ప్రకాష్‌నాయుడు, యూనిట్ ఇన్‌చార్జ్ అరగొండ శ్రీనివాసులు, బూత్ కమిటీ అధ్యక్షులు సురేష్ నాయుడు పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ

ప్రజాశక్తి- యాదమరి: మినీ క్రిస్మస్ వేడుకల్లో పూతలపట్టు నియోజకవర్గం ఎమ్మెల్యే మురళీమోహన్ పాల్గొన్నారు. సోమవారం తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో భాగంగా ఎమ్మెల్యే చేతులమీదుగా మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని జోడిచింతలలో మినీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా అందరూ కలసి మెలసి ఐక్యమత్యంగా ఉండి ముందుకు సాగాలని కోరారు. ప్రతిఒక్కరూ తమ వంతు చేతనైన సాయం చేసి మానవ విలువలను పెంపొందించుకునే విధంగా తోటి వారికి సాయపడాలని కోరారు. అనంతరం ముందస్తు క్రిస్మస్ కేకును కట్ చేసి మహిళలకు తెలుగుదేశం నాయకులు కార్యకర్తలకు పంచిపెట్టారు. తహశీల్దార్ పార్థసారథి, ఏపీవో సంధ్యారాణి, మండల అధ్యక్షులు మొరార్జీ యాదవ్, ప్రధానకార్యదర్శి వెంకటేష్ రబీ, జేనసేన మండల అధ్యక్షులు కుమార్, క్లస్టర్ ఇన్చార్జులు హిమగిరి, చిత్ర నాయుడు, విజయేంద్ర యాదవ్, నిత్య, క్రైస్తవ మత పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా గణిత దినోత్సవ వేడుకలు

గుడుపల్లి ద్రావిడ విశ్వవిద్యాలయంలో

ప్రజాశక్తి- విజయపురం (నగరి) : మండలంలోని ముడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవం ఘనంగా నిర్వహించినారు. ఇందులో భాగంగా పిల్లలకు వకృత్వ, వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించడంతో పాటు గణిత ఎగ్జిబిట్స్ నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. గణిత ఉపాధ్యాయులు భారతి, ప్రధాన ఉపాధ్యాయుడు పి.మురళీకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిత్తూరు అర్బన్ : బృందావన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో పాఠశాల ప్రిన్సిపల్ శైలజ కుమారి, పాఠశాల డైరెక్టర్ ప్రియ తేజ ఆధ్వర్యంలో జ్యోతి ప్రజ్వలనతో శ్రీనివాస రామానుజ అయ్యంగారి జన్మదినాన్ని జాతీయ గణిత దినోత్సవంను నిర్వహించారు. విద్యార్థులు గణితంకు సంబంధించిన అనేక నాటికలు, నృత్యాలు, పాటల రూపంలో ప్రదర్శనలు ఇవ్వడం జరిగింది.

గుడిపల్లి: ప్రసిద్ధ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ పుట్టినరోజు సందర్భంగా ద్రావిడ విశ్వవిద్యాలయంలో ఘనంగా గణిత దినోత్సవం ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది. ఉపకులపతి ప్రొఫెసర్ ఎం.దొరస్వామి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.కిరణ్ కుమార్, డీన్ అకడమిక్ అఫైర్స్ ప్రొఫెసర్ కే.శ్యామల, కీ నోట్ స్పీకర్ ప్రొఫెసర్ యశోద, యుజి ప్రిన్సిపల్ ప్రొఫెసర్ విజయవర్ధని, వైస్ ప్రిన్సిపల్ హరికృష్ణ పాల్గొన్నారు.

రొంపిచర్ల: మండలంలోని ఏపీ ఆదర్శ పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో విద్యార్థులు అనేక రకాల నమూనాలను ప్రదర్శించి గణితం పై తమకు ఉన్నటువంటి మక్కువను చాటుకున్నారు. ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ ఎం.రెడ్డి ప్రదీప్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే రొంపిచర్ల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జాతీయ గణిత దినోత్సవంలో పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు రఫీబాషా, మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసులు, గణిత ఉపాధ్యాయులు లాల్ షా, నాగరాజా, ఉపాధ్యాయులు అమరా నాయక్, శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

ఎస్ఆర్.పురం: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం భారతీయ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా గణిత దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కళావతి విద్యార్థులకు క్విజ్ పోటీలు, వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. గణిత ఉపాధ్యాయురాలు సత్య, బాలాజీ, చంద్రశేఖర్, బాబు, సరోజమ్మ, పద్మశ్రీ, జానకిదేవి, లోకనాథం, అరుణకుమారి, ప్రసన్నకుమారి, మహేష్ పాల్గొన్నారు.

చిత్తూరు బృందావన్ స్కూల్‌లో..

క్రైం న్యూస్

రేషన్ బియ్యం స్వాధీనం.. కేసునమోదు

ప్రజాశక్తి- కార్వేటినగరం: అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యంను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తేజశ్వని తెలిపారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మేజర్ పంచాయతీ కార్వేటినగరం శివాలయం వీధికి చెందిన ఆనంద్ శెట్టి కుమారుడు ఎ.బాలాజీ తమ పాత ఇంటిలో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ చేసినట్లు వీఆర్వో మోహనకు వచ్చిన ఫిర్యాదు మేరకు దాడులు నిర్వహించి అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. గతంలో కూడా తమిళనాడు నుంచి అక్రమంగా రేషన్ బియ్యం తీసుకొచ్చి అధిక ధరలకు వ్యాపారం చేసినట్లు అతనిపై కేసు ఉన్నట్లు చెప్పారు. అతని వద్ద ఉన్న 45 కేజీల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పేకాటరాయళ్లు అరెస్టు

ప్రజాశక్తి- కార్వేటినగరం: పేకాట రాయళ్లను అరెస్టు చేసిన సంఘటన మండల పరిధిలోని ఈదువారిపల్లి గ్రామసమీపంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ తేజశ్వని కథనం మేరకు వివరాలిలా.. ఈదువారిపల్లి గ్రామానికి సమీపంలో బహిరంగ ప్రాంతంలో పేకాట ఆడుతున్నట్లు అందిన రహస్య సమాచారం మేరకు దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2.820 నగదును స్వాధీనం చేసుకుని వారిపై కేసునమోదు చేసి అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. కోడిపందేలు, పేకాట, అక్రమంగా మద్యం అమ్మకాలు, సారా తయారీ, అమ్మకాలు వంటివి ఎక్కడైన నిర్వహిస్తున్న తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. దాడుల్లో పోలీసు సిబ్బంది రాజశేఖర్, యువరాజు, లోకనాథం, మోహన్, ఎస్బీఐ సిబ్బంది బాగ్యరాజ్ పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ డబ్బు కాజేసిన సంఘమిత్ర

ఏడాదిగా కార్యాలయం చుట్టు తిరుగుతున్న పట్టించుకొని అధికారులు

ప్రజాశక్తి- విజయపురం: సంఘమిత్ర ఇన్సూరెన్స్ డబ్బు కాజేసిన సంఘటన పన్నూరు గ్రామంలో చోటు చేసుకుంది. బాధితుని వివరలా మేరకు ఇలా ఉంది. పన్నూరు గ్రామానికి చెందిన ఇంద్రనమ్మ ఆనందవల్లి గ్రూపులో సభ్యురాలు, ఆమెకు 60 సంవత్సరాలు పైబడడంతో గ్రూపును నుంచి పేరు తొలగించారు. ఆ తరువాత ఆమె ఏడాది క్రితం మృతి చెందింది. ఆమె మృతి చెందడంతో ప్రభుత్వం నుంచి రూ.1.30లక్షలు ఇన్సూరెన్స్ డబ్బు చెక్ రావడం జరిగింది. ఆ చెక్‌ను బాధితురాలు భర్త స్వయంగా సంఘమిత్ర చేతికి అందజేశాడు. అయితే చెక్ తీసుకున్న సంఘమిత్ర ఇంత వరకు డబ్బు చెల్లించలేదని మృతురాలి భర్త గోవిందస్వామి వాపోయాడు. తమ ఇన్సూరెన్స్ డబ్బును ఇప్పించాలని వెలుగు కార్యాలయం వద్దకు ఏడాదిగా తిరుగుతున్న అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదని వాపోతున్నారు. తనకు న్యాయం చేయాలని జిల్లా అధికారులకు కోరుతున్నారు.

కార్మికురాలు మృతికి నివాళి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నగరపాలక సంస్థ పారిశుద్ధ్య విభాగంలో పొరుగుసేవల కింద పబ్లిక్ హెల్త్ కార్మికురాలుగా విధులు నిర్వహిస్తున్న వాణి మృతికి నగర మేయర్ ఎస్.అముద, కమిషనర్ పి.నరసింహ ప్రసాద్, ఎంహెచ్ఓ డాక్టర్ పి.లోకేష్ నివాళులు అర్పించారు. 17వ వార్డు పరిధిలో విధులు నిర్వహిస్తున్న వాణి అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం చిత్తూరు అంబేద్కర్‌నగర్‌లోని మృతురాలి నివాసానికి వెళ్లి పూలమాల వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ప్రభుత్వం తరపున మట్టి ఖర్చుల కింద రూ.15వేలు కుటుంబ సభ్యులకు అందించారు. ప్రభుత్వం నుంచి అన్ని విధాల ఆదుకుంటామని చెప్పారు. శానిటరీ ఇన్స్పెక్టర్లు, మేస్త్రీలు, కార్మికులు మృతురాలికి నివాళులర్పించారు.

చెరువుకట్ట ఆక్రమణపై ఫిర్యాదు

ప్రజాశక్తి- రొంపిచర్ల: మండలం బొమ్మయ్యగారిపల్లి గ్రామపంచాయతీ కల్లూరు - రొంపిచర్ల రహదారి పక్కన గెర్లపల్లిబాట గంగమ్మ గుడి సమీపంలోని కర్రేబోయిన చెరువుకట్టను బొమ్మయ్యగారిపల్లి పంచాయతీ రెడ్డివారిపల్లికి చెందిన కొందరు వ్యక్తులు కట్టను చదును చేసి నిర్మాణాలు చేపడుతున్నారని గెర్లపల్లికి చెందిన చంద్రమౌళి రెడ్డి అనే రైతు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రైతు మాట్లాడుతూ కర్రే బోయిన చెరువుపై ఆధారపడి ఎనిమిది ఎకరాలు వరకు పంటలను సాగు చేసుకుంటున్నామని తెలిపారు. ఈ చెరువుకు పంచాయతీలోని కంభం వారికుంట, వెంకటమ్మ కుంట, కంసులవానికుంట, నాగయ్య కుంటల నుండి వర్షపునీరు వచ్చి చెరువులో కలుస్తాయని ఇప్పుడు కొందరు వ్యక్తులు కట్టను చదును చేసి, నిర్మాణాలు చేపట్టి, పునాదులు నిర్మించారని, మరికొందరు నిర్మాణాల కోసం చెరువుగట్టును పూర్తిగా చదును చేశారని తెలిపారు. ఇప్పుడు కట్టను చదును చేయడం వల్ల వర్షం వస్తే చెరువు నీరంతా పంట పొలాలపై చేరి తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువు ఆక్రమణలను తొలగించి చెరువు కట్ట యథావిధిగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని రైతు కోరుకుంటున్నారు.

రోడ్డు విస్తరణకు కొలతలు

ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండలంలోని రాయలపేట గ్రామంలో రోడ్డు విస్తరణకు రెవెన్యూ అధికారులు సోమవారం కొలతలు చేపట్టారు. రోడ్డు విస్తరణకు ఇరువైపులా ఉన్న భవనాలకు మార్కింగ్ చేస్తూ ఎంత మేరకు నష్టం జరుగుతుందని రెవెన్యూ అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే కొన్నిరోజుల క్రితం రోడ్డు విస్తరణలో నష్టపోతున్న దుకాణదారులు పలుమార్లు స్థానిక ఎమ్మెల్యే అమర్నాథరెడ్డికి విన్నవించారు. రోడ్డు విస్తరణకు అందరం సహకరిస్తామని అయితే ప్రభుత్వం తగిన నష్ట పరిహారం అందించాలని బాధితులు ఎమ్మెల్యేకు తెలియజేసినట్టు తెలిపారు. ఈ విషయమై బాధితులు కొన్ని రోజుల క్రితం కలెక్టర్‌కు నష్టపరిహారం అందించాలని తెలియజేసినట్టు తెలిపారు. స్థానిక గ్రామ రెవెన్యూ అధికారి ఉమా శంకర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు మధ్య గుంత

ప్రజాశక్తి- వెదురుకుప్పం: గ్రామంలో రెండు వర్గాల మధ్య గొడవల కారణంగా ఆ గ్రామానికి రాకపోకలు నిలిచిపోవడంతోపాటు తాగునీటి సమస్య ఏర్పడిందని గ్రామస్తులు వాపోతున్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం రెవెన్యూ కార్యాలయానికి వెళ్లారు. తిరుమలయ్యపల్లి పంచాయతీ బాలుపల్లి గ్రామంలో వ్యక్తిగత కక్షలతో రోడ్డుకు అడ్డంగా రాకపోకలకు ఆటంకం కలిగించే విధంగా జెసిబితో గుంత తవ్వేశారని, పంచాయతీ తాగునీటి పైప్‌లైన్ పగిలిపోవడంతో నీళ్లు వృధాగాపోతూ తాగునీరు లేక అవస్థల పడుతున్న ప్రజలు అధికారులు తెలియజేశారు. వెంటనే స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఎ.పి.మోడల్ స్కూల్‌లో టీచర్ ఉద్యోగం అవకాశం

రామకుప్పం మండలం పేరూరు గ్రామంలో గల ఎ.పి. మోడల్ స్కూల్ & జూనియర్ కాలేజీ నందు జనరల్ సైన్స్ (TGT) ఉపాధ్యాయ పోస్టుకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానించబడుతున్నాయి.

పోస్టు వివరాలు

పోస్టు పేరు: TGT (Trained Graduate Teacher), **సబ్జెక్టు:** జనరల్ సైన్స్
ఖాళీల సంఖ్య: 01, **దరఖాస్తు గడువు:** ఈ ప్రకటన వెలువడిన తేది నుండి 7 రోజుల్లోగా దరఖాస్తులు పంపవలెను. దరఖాస్తులు పంపవలసిన ఈ-మెయిల్ apmodelschoolramakuppam@gmail.com

ప్రిన్సిపల్
ఎ.పి. మోడల్ స్కూల్ & జూనియర్ కాలేజీ
పేరూరు గ్రామం, రామకుప్పం మండలం, పిన్‌కోడ్-517 401